## వైభవంగా కల్యాణ వేంకటేశ్వరుని

# రథోత్సవం

**రథాన్ని లాగడానికి పోటీపడిన భక్తులు**



నారాయణవనం, మే 28 ప్రభాతవార్త :

నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి కల్యాణ వేంకటేశ్వరుడు ఎనిమిదవ రోజు మంగళవారం ఉదయం 8.10గంటలకు శ్రీవారి రథాన్ని అధిరోహించి నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తుల గోవిందనామా స్మరణతో శ్రీవారి మహారథం ముందుకు సాగి ంది. భక్తులు అడుగడుగునా శ్రీవారి రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. మొక్కుబడి కలిగిన భక్తులు శ్రీవారి రథంపై ఉప్పు, మిరియాలను చల్లి మొక్కును తీర్చుకున్నారు. అలాగే భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. శ్రీవారి మహారథం బజారువీధి, మెయిన్‌రోడ్డు, మెట్లవారివీధి, ఎగువ పద్మాశాలీవీధి గుండా గంగుద్ర మండపానికి 12గంటలకు చేరింది. అక్కడ నుంచి సాయంత్రం 3గంటలకు బయలుదేరి సాయంత్రం 6గంటలకు రథ మండపానికి చేరుకుంది. భక్తులు వేలాదిగా తరలివచ్చి హారతులను పట్టారు. రాత్రి 7:30గంటలకు శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరునికి వైభవంగా ఆర్జితం కల్యాణోత్సవం నిర్వహించారు. ఆర్జితం కల్యాణోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొని తరించారు. అనంతరం రాత్రి 9:30 గంటలకు అశ్వవాహనంపై అధిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, బేరితాడనము, తోమాలసేవ, శుద్ధి, నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సంకీర్తలను వినిపించారు. రథోత్సవంలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, డిప్యూటీఇఓ నాగరత్న, ఎఇఓ పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, సివిల్ ఇంజనీర్ గురుప్రసాద్, సిఐ భాస్కర్‌నాయక్, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, ఎఎస్‌ఐలు, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, శ్రీనివాస భట్టాచార్య, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## శ్రీవారిసేవలో మేయర్ డాక్టర్ శిరీష



తిరుమల, మే 28ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతి నగరపాలకసంస్థ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష దంపతులు మంగళవారం ఉదయం తిరుమలకు విచ్చేశారు. ఉదయం ఆలయంలో స్వామివారిఅష్టదళపాధపద్మారాధనసేవలో పాల్గొన్నారు. శ్రీవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## ఓట్ల లెక్కింపుకు

# కౌంట్‌డౌన్!

**మరో ఆరురోజులు ఉత్కంఠ గెలుపుపై ఎవరి ధీమా వారిదే**



తిరుపతి, మే 28 ప్రభాతవార్త:

సార్వత్రిక ఎన్నికలు ముగిసి 15రోజులు కావస్తుండటంతో ఇప్పుడు అందరి దృష్టి ఈవిఎం ఓట్ల లెక్కింపుపై ఉంది. ఓట్ల లెక్కింపుకు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో ఆరురోజులు మాత్రమే ఉంది. పోలింగ్ ముగిసి ఈవిఎంలు స్ట్రాంగ్ రూముల్లో గట్టి భద్రత నడుమ భద్రంగా ఉంచడం ఒక ఎత్తయితే వాటి లెక్కింపు రోజు భద్రత పర్యవేక్షణ మరింత క్లిష్టంగా ఉంటుంది. ఇన్ని రోజులు అటు ఓటర్లలో మాత్రం తీర్పు స్పష్టంగా బేరీజు వేసుకుంటున్నా జనం, ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు తమ నాయకుడంటే తమ నాయకుడే గెలుపు అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటరు నాడి మాత్రం అంచనా వేయలేకపోతు న్నారు. ఓటు ఎవరికి వేశారనేది మాత్రం ఆరురోజుల ఉత్కంఠతగానే ఉంది. తిరుపతి జిల్లాకు సంబంధించి తిరుపతి పార్లమెంట్ పరిధిలో తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి, గుడూరు, సూళ్ళూ రుపేట, చంద్రగిరి నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో ఓటింగ్ పోల్‌శాతం కూడా బాగానే పెరిగింది. ఈ ఓట్ల లెక్కింపు జూన్ 4వతేదీ మంగళవారం చేపట్టనున్నారు.తిరుపతిలోని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, ఎస్వీఆర్ట్సు కళాశాల ప్రాంగణాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. పోలీసుశాఖ, రెవెన్యూశాఖపరంగా అన్ని ఏర్పా ట్లు పూర్తిచేశారు. 4వతేదీ తొలుత పోస్టల్‌బ్యాలట్లు లెక్కించిన తరువాత ఈవిఎంల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ప్రజలు ఎవరిని ఆదరించి తమనాయకుడని తీర్పునిస్తున్నారనేది ఆరురోజులు ఆగాల్సిందే.

# ఏమప్పా.. ఎవరు గెలుస్తారంట !!

**గ్రామాల్లో రచ్చబండలు... టీ కొట్ల వద్ద ఎన్నికల కహానీలు !!**



కుప్పం, మే 28 ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు మరో ఆరు రోజుల సమయం మాత్రమే ఉండడంతో ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే విషయంగా గ్రామాల్లో రచ్చబండలు, టీ కొట్ల వద్ద ఎన్నికల కహానీలు కనబడుతున్నాయి. కోడి కూసి పొద్దుపుట్టిన వేళ గ్రామాల్లో అక్కడక్కడా ఉండే టీ అంగళ్లు, రచ్చబండలు రాజకీయ చర్చా వేదికలుగా మారిపోయాయి.ఒక్కొక్కరుగా వయసుతో బేధం లేకుండా అంగళ్ల వద్దకు చేరుకోవడం.. టీకి ఆర్డరు ఇచ్చి ఆ రోజు వచ్చిన దినపత్రికలను తిరగేయడం.. ఆ తర్వాత మెల్లగా రాజకీయ కబుర్లలోకి దిగడం జరుగుతోంది. ఈ దృశ్యం దాదాపు అన్ని గ్రామాల్లో నిత్యం కన్పిస్తోందే. ఏమప్పా ఈసారి ఎవరు గెలుస్తారంటా అని ఓ వ్యక్తి అడిగితే ఏమో తెలీదన్నా.. ఇంకో వారం చూడాలన్నా.. వచ్చే మంగళవారం తెలుస్తుందంట అంటూ సమాధానాలు చెప్పుకుంటున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి ఎన్నికలు అటు వైకాపాకు ఇటు తెదేపాకు కీలకమయ్యాయి. ఇరు పార్టీలకు జీవన్మరణ సమస్యగా ఈ ఎన్నికలు మారిపోయిన నేపథ్యంలో ఎన్నికలు చెదురుముదురు సంఘటనల మధ్య ముగిసిన విషయం విదితమే. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, పురుషులు, యువత తమ ఓట్లతో పోటెత్తారు. ఇప్పుడు ఇదే హాట్ టాఫిక్‌గా మారిపోయింది. చిత్తూరు జిల్లాలో గతంలో కంటే అధికంగా ఓటింగ్ శాతం పెరగడం,జిల్లాలో ఉన్న కుప్పం, పలమనేరు, చిత్తూరు, పుంగనూరు, పూతలపట్టు (ఎస్సీ), జిడి నెల్లూరు (ఎస్సీ), నగరి నియోజకవర్గాల్లో గ్రామీణ ఓట్లు అధికంగా పోలవడం జరిగింది. ముఖ్యంగా మహిళా ఓటర్లు ఆయా నియోజకవర్గాల్లో అధికంగా ఉండడంతో పాటు పోలింగ్ నాడు చీకటి పడ్డా ఓట్లు వేసేందుకు బారులు తీరి కన్పించిన విషయం విదితమే. అభ్యర్థుల జాతకాలను మార్చే అవకాశం మహిళా ఓటర్లకే ఉంది కాబట్టి ఇప్పుడు ఆయా గ్రామాల్లో మహిళలు ఎవరికి ఓట్లేశారనే చర్చ సైతం పెద్ద ఎత్తున సాగుతోంది.

# ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల అవినీతిపై విచారణకు ఆదేశం

**-నేటి నుండి 31వ తేదీ వరకు విచారణ**

100 రోజుల ఉపాధి హామీ
మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం

తిరుపతిరూరల్, మే 28 ప్రభాతవార్త:

ఎట్టకేలకు ఉపాధిహామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్స్‌పై విచారణకు రంగం సిద్ధమైంది. షోకాజ్ నోటీసులు అందుకున్న ఫీల్డ్ అసిస్టెంట్స్‌పై ఈనెల 29 నుండి 31వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణకు అధికారులు ఆదేశాలు జారీ చేసారు. ఉపాధి హామీ పనులలో అవకతవకలకు పాల్పడిన ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్స్‌కు ఈనెల 1వ తేదీన డ్వామా పి.డి. షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెల్సిందే. ఫీల్డ్ అసిస్టెంట్స్‌పై విచారణ చేపట్టాలని తిరుపతిరూరల్ ఎంపిడిఓ కూడా సిఫారస్సు చేసారు. కుంద్రపాకం ఫీల్డ్ అసిస్టెంట్, తనపల్లి ఫీల్డ్ అసిస్టెంట్, కొత్తూరు ఫీల్డ్ అసిస్టెంట్, తిరుచానూరు ఫీల్డ్ అసిస్టెంట్, రామానుజపల్లి ఫీల్డ్ అసిస్టెంట్, మల్లంగుంట ఫీల్డ్ అసిస్టెంట్, దుర్గసముద్రం ఫీల్డ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం తెల్సిందే.

**టెక్నికల్ అసిస్టెంట్స్ చేతివాటాన్ని పసిగడతారా!**

ఉపాధిహామీ పథకం పనులలో ఫీల్డ్ అసిస్టెంట్స్ చేసే అవకతవకలకు కొమ్ము గాస్తూ, ఉపాధిహామీ నిధులకు గండికొట్టడంలో కీలక పాత్ర టెక్నికల్ అసిస్టెంట్స్‌దే. కూలీలు పనిచేసే ఒకే ఫోటోను రెండు పంచాయతీలలో ఉపాధి పనులలో పెట్టి బిల్లు మంజూరు చేయించిన ఘనత కూడా వారిదే. అంతేకాదు ఉదయం 11గంటల లోపు ఉపాధి పనుల ఫోటోను ఎన్‌ఎంఎంఎస్ పెట్టాల్సిగా ఉండగా రాత్రి 10గంటల వేళలలో కూడా పెట్టి బిల్లులు పాస్ చేయించిన సమర్ధులు వీరు. ఫీల్డ్ అసిస్టెంట్స్‌గా జీతం తీసుకొంటూ ఉపాధి హామీ కూలీగా జాబ్ కార్డు పొందుతున్న ఉదారస్వాభావం వారిది. వారం వారం కూలీ తీసుకొంటున్న ఘనులు కూడా ఫీల్డ్ అసిస్టెంట్స్ ఉన్నారంటే వారి ఘనవాటి ఏపాటిదో అర్థమైతుంది. ఒకే ఫోటోను బర్పింగ్ చేసి, మరో మస్టర్స్‌కు, పక్క పంచాయతీలలో జరిగిన పనులకు కూడా అదే ఫోటోను వాడి బిల్లులు చేసుకున్న ప్రతిభ కూడా వారిదే. ఫీల్డ్ అసిస్టెంట్స్ అండగా ఉంటూ అవినీతికి ఆజ్యం పోస్తుంది మాత్రం టెక్నికల్ అసిస్టెంట్స్. ఉపాధి కూలీల ఫోటోలు బర్పింగ్ చేసిన విషయం ప్రస్ఫుటంగా కనిపిస్తున్న...ఆ ఫోటోలనే అప్లోడ్ చేసి బిల్లులు మంజూరు చేయిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్స్ పనితనం అంతా ఇంతా కాదు.

# ఫ్ఛ.. మళ్లీ రాకెట్ ప్రయోగం వాయిదా

**- అగ్నిబాణ్‌కి అన్నీ అవరోధాలే**






ప్రయోగానికి సిద్ధం చేసిన అగ్నిబాణ్ రాకెట్, ప్రయోగ వీక్షణలో సోమనాథ్, రాజరాజన్

శ్రీహరికోట నుంచి మంగళవారం తెల్లవారుజామున జరపతలపెట్టిన ప్రైవేటు వారి అగ్నిబాణ్ ప్రయోగం మరోసారి వాయిదా పడింది. దీంతో షార్‌లో శాస్త్రవేత్తలు నిరాశ చెందారు. అగ్నికుల్ కాస్మోస్ సంస్థ వారు సైతం ఈ ప్రయోగం పదేపదే వాయిదా పడటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చరిత్రలో మన రాకెట్ ప్రయోగ కేంద్రంలోనే ప్రైవేటు వారు లాంచ్ ప్యాడ్ నిర్మించుకొని అక్కడి నుంచి వారు రూపొందించిన రాకెట్‌ను ప్రయోగించడం అగ్నిబాణ్‌తోనే మొదలవుతుందని 2022లోనే చెప్పారు. అయితే ఈ కార్యక్రమానికి ఇప్పటిదాకా రెక్కలు రాలేదు. ఎప్పటికప్పుడు వాయిదా పడిపోతోంది. ఇది నాలుగోసారి మంగళవారం కూడా వాయిదా పడింది. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్, షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ తదితరులు ప్రయోగాన్ని పర్యవేక్షించారు. రాకెట్ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన మద్రాసు ఐఐటి డైరెక్టర్ కామకోటి, అగ్నికుల్ ప్రైవేటు స్టార్టప్‌కు చెందిన మోహిన్, శ్రీనాథ్ తదితరులు కూడా నిరాశ చెందారు. వీరు ఎన్నో రోజులు శ్రమించి ఈ రాకెట్‌ను రూపొందించారు. ఇస్రో చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయానికి తెరతీసే అవకాశాన్ని అందిపుచ్చుకున్న అగ్నికుల్ కాస్మోస్ సంస్థ మరోసారి రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఇన్నిమార్లు ఒకరాకెట్ ప్రయోగం వాయిదా పడటం షార్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. తెల్లవారుజాము ప్రయోగం కావడంతో శాస్త్రవేత్తలు, ప్రైవేటు సంస్థ వారు రాత్రి మొత్తం నిద్ర లేకుండా ప్రయోగ సన్నాహాలలో పాలుపంచుకొని చివరి క్షణాల్లో సాంకేతిక అవరోధాల కారణంగా వాయిదాలు పడుతుండటం వారిని పూర్తిగా నిరాశ పరుస్తోంది. మంగళవారం ఉదయం 5.45 గంటలకు ప్రయోగం జరపడానికి ముందు నుంచే దూరదర్శన్‌తో పాటు కొన్ని ఛానళ్లు కూడా ప్రత్యక్ష ప్రసారానికి సిద్ధమయ్యాయి. చివరికి ఈ ప్రయోగం హోల్డ్ అయినట్లు ప్రకటించారు. అగ్నికుల్ సంస్థ వెబ్‌సైట్‌లో తదుపరి ప్రయోగ సమయం గురించి తెలుసుకోవాలని మీడియాను, సోషల్ మీడియాకు కూడా సూచించారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో

# పక్కాగా మౌలిక సదుపాయాలు

**జాతీయ మానవ హక్కుల కమీషన్ ప్రత్యేక పర్యవేక్షకులు బాలకృష్ణ గోయల్**

చిత్తూరు, మే 28 ప్రభాతవార్త:



రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుత్రుల పనితీరు బాగుందని జాతీయ మానవ హక్కుల కమీషన్ ప్రత్యేక పర్యవేక్షకులు బాలకృష్ణ గోయల్ అన్నారు. జాతీయ మానవ హక్కుల కమీషన్ ప్రత్యేక పర్యవేక్షకులు బాలకృష్ణ గోయల్ మంగళవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, కింది స్థాయి అధికారులు, కింది స్థాయి ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో జాతీయ మానవ హక్కుల కమీషన్ ప్రత్యేక పర్యవేక్షకులు బాలకృష్ణ గోయల్ మాట్లాడుతూ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి అపోలో, ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తుందని, ఫిర్యాదులకు సంబంధించి కంప్లైట్ బాక్స్‌ను ఏర్పాటు చేసి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా పలువురు పేషంట్లకు సంబంధించిన బంధువులను ఏర్పాట్లు, వైద్య సౌకర్యం గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. జాతీయ మానవ హక్కుల సంఘం వివిధ రాష్ట్రాల్లో పర్యటించిందని, చిత్తూరు జిల్లాలో పలు కార్యాలయాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశామన్నారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నడుస్తుండటంతో సంయుక్తంగా కలిసి పనిచేసి ఆసుపత్రికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో అపోలో యాజమాన్యం ఏర్పాటు చేసిన వివిధ వసతులపై ఆయన ప్రశ్నించారు. వాతావరణ కాలుష్యం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో రోగులు వుండేలా చూడాలని, బయో వేస్ట్ డిస్పోస్ చేసే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే పేషెంట్లకు అందించే ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆహారం అందించే ప్రక్రియను పరిశీలించడానికి ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలన్నారు. చిన్న పిల్లల వార్డుల్లో అందిస్తున్న వైద్య సేవలు, ఐసియులో వున్న ఏర్పాట్లతో పాటు ఇతర వసతులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, సాంఘీక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజ్యలక్ష్మి, బిసీ వెల్ఫేర్ డిడి రబ్బానీ భాషా, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఐసిడిఎస్ పిడి నాగశైలజ, ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్, అపోలో ఆసుపత్రి ఇన్‌ఛార్జి నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు





మల్టీ లెవల్ కార్ పార్కింగ్ నిర్మాణ పనులు పూర్తి చేయండి

ఐరాలలో వైభవంగా శ్రీపాలేటమ్మ జాతర

4 లో





# ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా విధుల నిర్వహణ

**- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి**

చిత్తూరు, మే 28 ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికలు-2024 ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అప్రమత్తంగా విధులు నిర్వహించి, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సమిష్టి బాధ్యతతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పిలుపునిచ్చారు. జడ్పీ సమావేశభవనంలో మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రక్రియపై పర్యవేక్షకులు, కౌంటింగ్ సహాయకులు, సూక్ష్మ పరిశీలకులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమానికి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్, చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్ఓ, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు హాజరై ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మే 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తయ్యిందని, ఇందుకు సంబంధించి ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రంలో జూన్ 4వ తేదీ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియను విజయవంతం చేయడంలో అందరి సమిష్టి కృషి వుందని, అదే స్ఫూర్తిని కొనసాగించి ఓట్ల లెక్కింపు ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే కౌంటింగ్ పర్యవేక్షకులు, కౌంటింగ్ సహాయకులు, సూక్ష్మ పరిశీలకులు ఈ అంశంపై పూర్తి అవగాహన పొందాలన్నారు. తద్వారా సజావుగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయవచ్చునన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి వున్న హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకోవాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు రోజున నిర్ధేశించిన సమయంలోపు రిపోర్ట్ చేయాల్సి వుంటుం దన్నారు. కౌంటింగ్ హాలులోపలికి ఫోన్లకు అనుమతి లేదన్నారు. ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ప్రతి ఆర్ఓ వారి నియోజకవర్గపు ఓట్ల లెక్కింపుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే కౌంటింగ్ సిబ్బందికి జూన్ 3వ తేదీ పరిశీలకుల సమక్షంలో 2వ విడత శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. చిత్తూరు ఎస్వీ సెట్ ఓట్ల లెక్కింపు కేంద్రంలో చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు వేరు వేరుగా ఓట్ల లెక్కింపు చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి ప్రతి అంశంను కూలంకుషంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రిటైర్డ్ జెసి, మాస్టర్ ట్రైనర్ విఆర్ చంద్రమౌళి వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిఆర్ఓ బి.పుల్లయ్య, పుంగనూరు, నగరి, జి.డినెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మధుసూధన్‌రెడ్డి, వెంకటరెడ్డి, వెంకటశివ, చిన్నయ్య, మనోజ్‌రెడ్డి, శ్రీనివాసులు, ఏఆర్ఓలు, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మి ప్రసన్న, ఓట్ల లెక్కింపు పర్యవేక్షకులు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 89పెద్దూరులో పోలీసులచే కార్డెన్ సెర్చ్

రామకుప్పం, మే 28 ప్రభాతవార్త



మండలంలోని 89 పెద్దూరు గ్రామంలో మంగళవారం ఎస్సై శివకుమార్ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇటీవల వైకాపా, తెదేపా శ్రేణుల మధ్య ఘర్షణల నేపథ్యంలో గ్రామంలో పోలీసు కవాతు సైతం నిర్వహించారు. 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో గ్రామంలో అల్లర్లు, గొడవలకు దిగితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఈస ందర్భంగా అక్రమంగా నిల్వ ఉన్న అరవై లీటర్ల డీజిల్‌తో పాటు రికార్డుల్లేని మూడు టు వీలర్లను సీజ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం

రామకుప్పం, మే 28 ప్రభాతవార్త



దివంగత ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని తెదేపా నేతలు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయం వద్ద ఎన్టీఆర్ 101వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేశారు. రెండురూపాయలకే కిలో బియ్యం ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, పత్ర నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు ఆన ందరెడ్డి, నేతలు సీతాపతి, ఆంజనేయరెడ్డి, కృష్ణానాయక్, చిన్నికృష్ణ, చలపతి, నందారెడ్డి, రామూర్తి పాల్గొన్నారు.

## గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

కుప్పంరూరల్, మే 28 ప్రభాతవార్త



మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఇఒపిఆర్‌డి విజయ్‌దత సూచించారు. స్థానిక మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాల్లో రైతుల బోర్లను టైఅప్ చేసుకుని ప్రజలకు నీటిని సరఫరా చేయించాలన్నారు. మోటార్లు, స్టార్టర్ల సమస్యలు తలెత్తితే యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు. మరో పదిహేను రోజుల్లో వర్షాకాల ం మొదలవుతుందని గ్రామాల్లో పారిశుధ్య పనులపై కూడా కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## మున్సిపల్ శానిటరీ మేస్త్రీ విధులనుంచి తొలగింపు

కుప్పం, మే 28 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ విధానంలో శానిటరీ మేస్త్రీగా పనిచేస్తున్న సంతోష్‌కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ నాగేశ్వరరావు తెలిపారు. సంతోష్‌కుమార్‌కు కేటాయించిన 3,10,11,12,23,24 వార్డులయందు తరచూ చెత్త తొలగింపులు లేక నిల్వలు అలాగే ఉంటాయని ప్రజలనుంచి ఫిర్యాదులు అందాయన్నారు. అలాగే ఎన్నికల విధులు, గంగజాతర విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు ఫోన్ చేసినా సమాధానం ఇవ్వక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సైతం అతనిపై ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో సంతోష్‌కుమార్‌ను విధులనుంచి తొలగించినట్లు కమీషనర్ పేర్కొన్నారు.

## రుతుక్రమం - ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం



వెంకటగిరి టౌన్, మే 28, ప్రభాతవార్త

వెంకటగిరి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని ధర్మపురం అంగన్‌వాడి కేంద్రం నందు రుతుక్రమం - ఆరోగ్యము - పరిశుభ్రత అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ కల్పలత, కృష్ణవేణి మహిళ పోలీస్ కిషోర బాలికలకు, ఆడపిల్లలు నెలసరి సమయం నందు ఐరన్ ప్రోటీన్ సమృద్ధిగా తీసుకొని అనిమియా బారిన పడకుండా ఉండాలని క్రమంలో శానిటరీ ప్యాడ్స్ మార్చాలి, వ్యక్తిగత పరిశుభ్రత ఉండాలి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, మహిళా పోలీస్, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడి టీచర్ రమణమ్మ, కిషోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలే ట్రాయ్ లక్ష్యం

పాలసముద్రం, మే 28 ప్రభాతవార్త:

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యులు చిట్టిబాబు అన్నారు. జిడినెల్లూరు కాగ్ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం టెలికం కంపెనీలు వినియోగదారులతో అవగాహన సదస్సు ను నిర్వహించాయి. సమావేశంలో ట్రాయ్ కాగ్ సభ్యులు చిట్టిబాబు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక టెలికం కంపెనీలు వున్న దేశం చైనా మొదటి స్థానం ఆక్రమించగా రెండవ స్థానంలో భారతదేశం వుందన్నారు. టెలికాం కంపెనీల నుండి వినియోగదారులు అత్యుత్తమ సేవలు అందుకొనే విధంగా అవగాహన సమావేశాలు నిర్వహించాలన్నారు. మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ పథకం 2006 నుండి అమలు అవుతుందని, ఇప్పటి వరకు 60 కోట్ల మంది వినియోగదారుల ఈ పథకంను వినియోగించుకున్నారన్నారు. 2025 నాటికి ప్రతి ఒక్కరు బ్రాడ్‌బాండ్ కలిగి వుండేలా దేశ వ్యాప్తంగా 6 లక్షల గ్రామాల్లో ఇంటర్నెట్ వుండేవిధంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ అధికారులు శివయ్య, రాజ్‌కుమార్‌లు, రూరల్ యాక్షన్ సంస్థ ప్రోగ్రామ్ షాలినీ, ట్రైనర్స్ చందు, సోనియా, సత్య, జాస్మిన్, మహిళా సమాఖ్య నాయకులు రామేశ్వరీ, వెలుగు సిసిలు, వినియోగదారులు, మహిళలు పాల్గొన్నారు.

## 31న వాహనాల వేలం

చిత్తూరు, మే 28 ప్రభాతవార్త:

చిత్తూరు రూరల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం మిట్టూరులో వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం ఈ నెల 31వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించడం జరుగుతుందని సెబ్ ఇన్స్‌పెక్టర్ హరికృష్ణ తెలిపారు. వాహనాల వేలంలో పాల్గొనదలచిన వారు వేలం నిర్వహించే రోజు ఉదయం స్టేషన్‌కు వచ్చి ముందుగా 2 వేల రూపాయల డిపాజిట్ చెల్లించి వాహనాల వేలంలో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు.

## యువతిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

గుడిపాల, మే 28 ప్రభాతవార్త:

మండల పరిధిలో చిత్తపార గ్రామంలోని నందినిపై దాడి చేసిన యువకుడు విజయ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నందిని ఇచ్చిన ఫిర్యాదుతో పాటు నందినికి తీవ్రంగా గాయపరచినట్లు డాక్టర్లు నిర్ధారించడంతో విజయ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

## తెలుగుజాతి మరువలేని మహనీయుడు ఎన్టీఆర్

కుప్పం, మే 28 ప్రభాతవార్త



తెలుగుజాతి మరువలేని మహనీయుడు దివంగత ఎన్టీఆర్ అని తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ 101వ జయంతిని ఘన ంగా నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, డా॥ వెంకటేష్, మున్సిపల్,మండల పార్టీ అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, నేతలు సాంబశివం,వేలు,సోమశేఖర్, ఆర్ముగం, ఆర్ఆర్ రవి, రవి, రామచంద్ర, వెంకటేష్, ఉపేంద్రకుమార్, అప్పు, జయరాంనాయుడు,విష్ణు, బాలాజీ, వాసు, అశోక్, ఉదయ్, చలపతి, శ్యాంసుందర్, నరేష్, సుబ్బు తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ పరిధిలోని వార్డులు, గ్రామాల్లో సైతం ఎన్టీఆర్ జయంతిని దేశం నేతలు ఘనంగా జరుపుకున్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

కుప్పం, మే 28 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఈనెల 29న కుప్పంలోని నూతన మున్సిపల్ కార్యాలయ భవనంలో కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమలులోఉన్ననేపథ్యంలోసమావేశాన్నివాయిదావేసినట్లుమున్సిపల్‌కమీషనర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## ఎన్టీఆర్ సేవలు మరువలేనివి

శాంతిపురం, మే 28 ప్రభాతవార్త



మాజీ సిఎం, దివంగత ఎన్టీఆర్ సేవలు మరువలేనివని తెదేపా నేతలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, ఎల్.జయరాంరెడ్డి, చలపతి, ఉయ్యాల జయరాంరెడ్డి, రమేష్, శేఖర్, నాగరాజు, మణి, బాలు, మునేగౌడు, శివ, బసవరాజు, మురుగన్, గోపాల్, దాము, కోదండప్ప,రాధాకృష్ణ, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ, శ్యామలమ్మ, పౌలారాణి, రూప,హేమ,సరిత పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి

వెదురుకుప్పం, మే 28 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు లోకనాథ రెడ్డి ఆధ్వర్యంలో రామారావు జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించి, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి థామస్ తమ్ముడు నిధి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మోహన్ మురళి, మండల ప్రధాన కార్యదర్శి నరసింహా యాదవ్, నియోజకవర్గం టిఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు పోటుగారి గంగయ్య, క్లస్టర్ ఇన్‌చార్జీ చంగల్రాయ రెడ్డి, సర్పంచ్ శ్రీనాథ్ రెడ్డి, నాయకులు బాబు నాయుడు, చాణిక్య ప్రతాప్, చిట్టెమ్మ, మురళి నాయుడు, చంద్రశేఖర్, జయచంద్రా రెడ్డి, దామోదర్ రెడ్డి, రమేష్ నాగి రెడ్డి, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక యువతకు స్ఫూర్తి స్వర్గీయ తారకరామారావు

- చిత్తూరు టిడిపి ఎంపి అభ్యర్థి తనయుడు దగ్గుమళ్ల రాధేయ్

చిత్తూరురూరల్, మే 28ప్రభాతవార్త:



చిత్తూరు టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు సిఆర్ రాజన్ నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ తారక రామారావు 101 జయంతి వేడుకలను పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాధేయ్ కన్‌స్ట్రక్షన్ అధినేత దగ్గుమళ్ల రాధేయ్ మాట్లాడుతూ ప్రజాహిత పాలనకు నిలువెత్తురూపం, తమలాంటి ఆధునిక యువతకు ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రధాత అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు,మాజీ ఎమ్మెల్యే మనోహర్, టిడిపి రాష్ట్ర అధికారప్రతినిధి సురేంద్రకుమార్, మాజీ మేయర్ కఠారి హేమలత, టిడిపి జిల్లా మాజీ కార్యదర్శి చంద్రప్రకాష్, చిత్తూరు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, యాదవ సాధికార సమితి టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, టిడిపి నాయకులు శేషాద్రినాయుడు, యువరాజులనాయుడు, విజయ్‌కుమార్, ఫిరోజ్‌ఖాన్, జాఫర్, కందప్రసాద్, రాణి, సిఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

## 31న కమలాంజనేయస్వామి వార్షిక జన్మోత్సవం

చౌడేపల్లి, మే 28 ప్రభాతవార్త

ఈనెల 31నుంచి జూన్ 2వరకు స్థానిక కమలాంజనేయస్వామి వార్షిక జన్మోత్సవం, హనుమజ్జయంతిని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికిపలు జరుగుతాయని, భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## మైసూరు చాముండేశ్వరీ ఆలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

పాలసముద్రం, మే 28 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మంగళవారం కర్నాటక రాష్ట్రం మైసూరు చాముండేశ్వరీ ఆలయంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి వాసు నాయుడు, ఇతర పార్టీ నాయకులు ఆలయంలో ఎన్టీఆర్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో జిల్లా దేశం కార్యదర్శి వాసు, దేశంనాయకులు శేఖర్‌రాజు,విజయ్‌కుమార్,సాంబశివన్, నాగరాజు, తంగరాజు, హిమాద్రి పాల్గొన్నారు.

## షెడ్యూల్ మేరకు పారిశుధ్యం పనులు

- మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, మే 28 ప్రభాతవార్త:

చిత్తూరు నగర పరిధిలో షెడ్యూల్ మేరకు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజారోగ్య సంరక్షణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. నగర పరిధిలో బస్టాండ్లు, మార్కెట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇతర జనసమర్థ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం కమిషనర్ డాక్టర్ జె.అరుణ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ, వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి



జేసి ధ్యానచంద్ర

వెంకటగిరి టౌన్, మే 28, ప్రభాతవార్త

జూన్ నెల 4వ తేది జరగబోవు వెంకటగిరి నియోజకవర్గ ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ధ్యానచంద్ర తెలిపారు. వెంకటగిరిలోని ఆర్ఓ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్శిటీలో కౌంటింగ్ కూడా నిర్వహించామని చెప్పారు. 14 టేబుల్స్, 22 రౌండ్స్ ఉన్నట్లు చెప్పారు. పోస్టర్ బ్యాలెన్స్ లెక్కింపు కోసం మూడు టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రశాంతంగా కౌంటింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. కాగా ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తమకు 20,700 ఇవ్వాల్సి ఉండగా 10,700 మాత్రమే ఇచ్చారని తమకు న్యాయం చేయాలని వారు రిటర్నింగ్ అధికారిని కోరారు. ఆయన వెంట తహశీల్దార్ సాంబశివరావు, ఎంపిడిఓ విజయలక్ష్మి, హౌసింగ్ డిఈ షబ్బీర్ అలీ, సిడిపిఓ శంషాద్ బేగం తదితరులు ఉన్నారు.

## యుగ పురుషుడు ఎన్టీఆర్

గూడూరు టీడీపి ఎమ్మెల్యే అభ్యర్థి పాశం సునీల్ కుమార్

గూడూరు, మే 28, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి వేడుకలు గూడూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గమళ్ళపాలెంలో ఏర్పాటైన టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి

సూళ్లూరుపేట, మే 28 ప్రభాతవార్త



ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని టిడిపి పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటాన్ని ఉంచి నివాళి అర్పించడంతో పాటు బర్త్‌డే కేక్ కట్ చేసి పంచిపె ట్టారు. అనంతరం సీనియర్ తెలుగుదేశం పార్టీ మహి ళా కార్యకర్త, ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న సరసమ్మను పట్టణ పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్ ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాముూరు మునుస్వామి, సిహెచ్ చంద్రయ్య, బిసి సెల్ అధ్యక్షులు చిట్టేటి పెరుమాళ్, దంతాల రవి, పాముూరు మునుస్వామి, మెస్ రమణయ్య, వాకిచర్ల రమేష్, నలజాం రాము, పి.చెంగయ్య, వెంకట స్వామి, మస్తాన్, శేఖరయ్య, సుధాకర్ యాదవ్, శశి, బుద్ది విజయలక్ష్మి, శారద, మంజుల, సిహెచ్ రమణయ్య, ఆలీ తదితరులుపాల్గొన్నారు.

## రాష్ట్ర జూడో అసోసియేషన్ సభ్యులుగా రమేష్‌నాయుడు

సూళ్లూరుపేట, మే 28 ప్రభాతవార్త



రాష్ట్ర జూడో అసోసియేషన్ సభ్యులుగా సూళ్లూరుపేటకు చెందిన రాయపు రమేష్‌నాయుడు మంగళవారం ఎంపికయ్యారు. పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో నివసిస్తున్న రమేష్‌నాయుడు క్రీడల పట్ల ఆసక్తి కనబరుస్తూ, క్రీడాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారు. రమేష్‌నాయుడు కృషిని గుర్తించి రాష్ట్ర జూడో అసోసియేషన్ సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా స్థానిక శ్రీనగర్ కాలనీ వాసులు మంగళవారం ఆయన్ను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మొలకల రమణయ్య, పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మునీశ్‌రెడ్డి, ఎంవి రమణయ్య, పల్లేటి బాలాజీ, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు శిక్షణ

కోట, మే 28 ప్రభాతవార్త



కోటలోని ఎంఆర్‌సి భవనంలో మధ్యాహ్న భోజనం తయారు చేసే నిర్వాహకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. వెంకటగిరి నుంచి రిసోర్స్ పర్సన్ సుగుణ శిక్షణ తరగతులు నిర్వహించారు. వంట ఏజన్సీ నిర్వాహకులు ఏ విధంగా వంట తయారు చేయాలి, వంట తయారీలో నూనె ఎంత వేయాలి, పప్పు దినుసులు మసాలా ఎంత వాడాలో ముందస్తుగా సిద్ధం చేసిన నమూనాలను వివరించారు. అన్నం, ఆకుకూర, పప్పు, సాంబార్ రైస్, పాయసం, కిచిడి, కూరగాయలు.. ఇలా ఆరురోజులు పిల్లలకు వడ్డించే మెనూ మహిళలతో తయారు చేయించి చూపించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎంఇఓ మస్తానయ్య పరిశీలించారు

## తెలుగు జాతి ముద్దుబిడ్డ ఎన్టీఆర్

కోట, మే 28 ప్రభాతవార్త

తెలుగుజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలుగుదేశం పార్టీ జిల్లా బిసిసెల్ ప్రధాన కార్యదర్శి తీగల సురేష్‌బాబు అన్నారు. కోటలో ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి తీగల సురేష్‌బాబు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, కోట పట్టణ టిడిపి అధ్యక్షుడు షేక్ షంషుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

కోట, మే 28 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లో మంగళవారం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో మాజీ ఎంపిటిసి సభ్యులు బాలసుబ్రహ్మణ్యం గాయపడ్డారు. చిట్టేడు నుంచి విద్యానగర్‌కు వస్తున్న బాలసుబ్రహ్మణ్యంను గోవిందపల్లి నుంచి చిట్టేడు వైపు వెళుతున్న మరో బైక్ ఢీకొంది. ఈ సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

## బిఎల్‌ఓలకు అందని భృతి

కోట, మే 28 ప్రభాతవార్త

సార్వత్రిక ఎన్నికల పనుల్లో క్షేత్ర స్థాయిలో బిఎల్‌ఓలు ఎంతో కష్టపడ్డారు. ప్రతి గ్రామంలో తిరిగి వివరాలు సేకరించారు. ఓటర్ల మార్పులు చేర్పులలో కీలకపాత్ర పోషించారు. ఇంత కష్టపడినా వీరికి సకాలంలో పారితోషికం మాత్రం అందడం లేదు. ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది జూలై 21వ తేదీ నుంచి ఇంటింటికి ఓటరు సర్వే, ఆ తర్వాత ముసాయిదా ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, ఓటరు చీటీలు పంపిణీతో పాటు ఎన్నికల ప్రక్రియలోనూ చురుగ్గా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో బిఎల్‌ఓలకు నిర్దేశిత భృతి చెల్లించాలని ఎన్నికల సంఘం ఆదేశించినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు జోక్యం చేసుకొని తమకు రావాల్సిన భృతిని ఇవ్వాలని వారు కోరుతున్నారు.

## సినీ రాజకీయ రంగాలకు వన్నెతెచ్చిన ఎన్టీ రామారావు

బాలాయపల్లి, మే 28, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో దివంగత మాజీ సిఎం తారక రామారావు జయంతి సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు భారీ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు, టిడిపి నేతలు కోటేశ్వర్ గౌడ్, సత్యనాయుడులు మాట్లాడుతూ తెలుగు జాతి ఖ్యాతిని దిశదిశలా చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని తెలిపారు. ఎన్టీఆర్ ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడిగా ఉన్నారని టిడిపి తిరుపతి జిల్లా కార్యదర్శి వెంకటాద్రి చెప్పారు. పేదల కడుపు నింపేందుకు రూ. 2 లకే బియ్యాన్ని ఎన్టీఆర్ ఇచ్చారని సీనియర్ నేత సత్యంనాయుడు వివరించారు. తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్ వన్నె తెచ్చారని టిడిపి బిసి నేత జడపల్లి కోటేశ్వర గౌడ్ పేర్కొన్నారు.

## డివిసత్రంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు

దొరవారిసత్రం మే 28 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన దొరవారిసత్రం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను ఆపార్టీనాయకులు కార్యక్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.అనంతరం మండలపార్టీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు ఎనటీఆర్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళర్పించారు. ఆయన చేతుల మీదుగా కేక్ కట్‌చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు చింతకాని కిషోర్‌నాయుడు,జగదీష్‌నాయుడు,పురుషోతమ్,బందిల ఉదయ్‌కుమార్,తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించాలి

సూపర్వైజర్ రాజేశ్వరి

బాలాయపల్లి, మే 28, ప్రభాతవార్త



రుతుక్రమం సమయంలో బాలికలు శుభ్రత పాటించాలని అంగన్వాడీ కేంద్రాల సూపర్వైజర్ రాజేశ్వరి సూచించారు. మండలంఓని జయంపు అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ రుతుక్రమ దినోత్సవ సందర్భంగా బాలికలకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ రుతుక్రమ సమయంలో ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్త చూపించాలన్నారు. బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## చంద్రబాబు సిఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారు

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి టౌన్, మే 28, ప్రభాతవార్త



జూన్ నెల 4వ తేది జరగబోయే ఓట్ల లెక్కింపులో తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో దివంగత మాజీ సిఎం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతో ప్రజలు విరక్తి చెందారని తెలిపారు.ఎంపిపి తనుజ రెడ్డి, మాజీ జడ్పిటిసి రామచంద్ర నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, నాయకులు గంగాధర్, రాజేశ్వర రావు, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ఎన్వీఆర్ చారిటబుల్ సొసైటీ లక్ష్యం

చైర్మన్ నక్కా వెంకటేశ్వరరావు

వెంకటగిరి టౌన్, మే 28, ప్రభాతవార్త



పేదల సంక్షేమమే ఎన్వీఆర్ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ చైర్మన్ నక్కా వెంకటేశ్వర రావు తెలిపారు. పట్టణంలోని 10వ వార్డు మనులాల్‌పేటలోని నిరుపేద చేనేత కళాకారుడు సజ్జ కృష్ణయ్య అనారోగ్యం కారణంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎన్‌వీఆర్ చారిటబుల్ సొసైటీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు సొసైటీ తరపున వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో భాగంగా చింతగింజల సుబ్రమణ్యం, 10వ వార్డు కౌన్సిలర్ నాగమంతల శివ, గౌరబత్తిన శేఖర్, సజ్జ మనోహర్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కారణజన్ముడు నందమూరి తారక రామారావు

తడ, మే 28 ప్రభాతవార్త



దివంగత మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు కారణ జన్ముడని టిడిపి నాయకులు కీర్తించారు. ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా తడలో మంగళవారం ఆ పార్టీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూజలు చేసి ఘనంగా నివాళి అర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. తెలుగుదేశం పార్టీ మండల నాయకులు తడతో పాటు వాటంబేడుకుప్పం తదితర గ్రామాల్లో కూడా ఎన్టీఆర్ జయంతిని జరుపుకున్నారు.

## నాటి ఎన్టీఆర్‌తో అనుబంధాలను గుర్తు చేసుకున్న చేవూరు

గూడూరు, మే 28, ప్రభాతవార్త



గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో 1987 సంవత్సరంలో మాజీ సిఎం నందమూరి తారకరామారావు విచ్చేశారు. గూడూరు మండల అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవూరు విజయ మోహన్ రెడ్డిని గెలిపించండని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆ ఎన్నికల్లో చేవూరు ఘన విజయం సాధించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఎన్టీఆర్‌తో నాటి జ్ఞాపకాలను చేవూరు విజయ మోహన్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ మరపురాని మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఆయనతో అనుబంధం మరపురానిదని పేర్కొన్నారు.

## కూటమి గెలుపుతో రాష్ట్రానికి స్వర్ణయుగం

**తొట్టంబేడు, మే 28 ప్రభాతవార్త**



కూటమి గెలుపుతో రాష్ట్రానికి స్వర్ణయుగం అని సుధీర్‌రెడ్డి గెలుపు ఖాయం అని ఆయన గెలుపుకోసం పనిచేసిన మండల పార్టీ సీనియర్ నాయకులకు కార్యకర్తలకు ధన్యవాదాలని మండలపార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు అన్నారు. ఐదేళ్ళుగా అన్ని రంగాల్లో వెనుకబడిన రాష్ట్రం మళ్ళీ చంద్రబాబుహయంలో స్వర్ణయుగంగా మారడం తథ్యమన్నారు. మరో కొద్దిరోజుల్లో తెలుగుదేశంపార్టీ అటు రాష్ట్రంలోను, ఇటు శ్రీకాళహస్తిలోను తెలుగుదేశంపార్టీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. కుప్పం నుంచి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, మంగళగిరి నుంచి జాతీయ ప్రధానా కార్యదర్శి నారాలోకేష్‌లు అ్యధిక మెజారిటీతో గెలవనున్నారన్నారు. ప్రజలు తెలుగుదేశంపార్టీకే పట్టం కట్టారని వివరించారు.

## సామాన్యుడికి రాజకీయ భిక్ష పెట్టిన ఎన్‌టిఆర్

**ఎస్‌సివి నాయుడు**

**శ్రీకాళహస్తి,మే 28 ప్రభాతవార్త**



రాజరిక వ్యవస్థలో సామాన్యునికి రాజకీయబిక్ష ఇచ్చిన మహానీయుడు ఎన్‌టిఆర్ అని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు.మంగళవారం నందమూరి తారక రామారావు 101 జయంతిని ఎస్‌సివి నాయుడు సారథ్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. పెద్ద కేక్ పెట్టి కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు.ఈ సందర్భంగా ఎస్‌సివి నాయుడు మాట్లాడుతూ 9 నెలల తెలుగుదేశం పార్టీ వంద సంవత్సరాల చరిత్ర కల్గిన కాంగ్రెస్‌ను మట్టికరిపించారన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం ఢిల్లి పెద్దల తలలు వంచింపజేసిన మహానీయుడు ఎన్‌టిఆర్ అన్నారు. జయంతి కార్యక్రమాల్లో యువత నాయకుడు సత్రవాడ ప్రవీణ్,ఎస్‌సివి దిలీప్,నారాయణ, మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు డివి.నారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ ముత్యాలపార్థసారధి, గోగినేని భాస్కర్‌నాయుడు, మాజీ కౌన్సిలర్ ప్రసాద్‌నాయుడు, గోగినేని సురేష్, ఎస్సీవీకిరణ్, హరి తదితరులు పాల్గొన్నారు.

## శాంతి అభిషేకాలు: ఏకాంత సేవతో ముగిసిన బ్రహ్మోత్సవాలు

**శ్రీకాళహస్తిరూరల్,మే 28 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా మండలంలోని ఊరందూరు గ్రామంలో వెలసిన శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం శాంతి అభిషేకాలు,ఏకాంత సేవతో ముగిసాయి. ఉదయం నుంచి ఆలయంలో స్వామి అమ్మవార్ల మూలవిరాట్టులతో పాటు ఉత్సవర్లకు శాంతి అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పది రోజుల పాటు జరిగిన ఉత్సవాలను ఎలాంటి ఒడుదుడుకుల్లేకుండా నిర్వహించారు. ఈ ఏడాది ఉత్సవాల్లో అలంకారాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. మంగళవారం ఉదయం నుంచి ఆలయంలో శాంతి అభిషేకాలను నిర్వహించారు.రాత్రి ఏకాంత సేవలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయ దారులు చిట్టెం కృష్ణయ్య, చిట్టెం శ్రీకాంత్‌ల కుటుంబసభ్యులు హాజరయ్యారు.

## మధ్యాహ్న భోజన పథకంపై కార్మికులకు శిక్షణ

**శ్రీకాళహస్తి, మే 28 ప్రభాతవార్త**



రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మధ్యాహ్నభోజన పథకం కార్మికులకు శిక్షణ కార్యక్రమంను మంగళవారం పట్టణంలోని కొత్తపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలికల ఉన్నత పాఠశాలలో శ్రీకాళహస్తి ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్యలు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎండిఎం జిల్లా కోఆర్డినేటర్ జయరాంనాయుడు, ఉపాధ్యాయులు హేమకుమార్, రమేష్, ఎంఈవో కార్యాలయ సిబ్బంది లలిత, మాధవయ్య, కెవి.ప్రశాంత్, సిఆర్‌ఎంటిలు మునిమోహన్, ప్రదీప్‌కుమార్, ధనశంకరయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగువారి ఖ్యాతిని చాటిన ఎన్టీఆర్

**తిరుపతి,మే 28ప్రభాతవార్త:**



తెలుగువారి ఖ్యాతిని దశదిశలా చాటిచెప్పిన మహాపురుషుడు ఎన్టీఆర్ అని టిడిపి నాయకులు కొనియాడారు. ప్రజలను రాజకీయంగా చైతన్యంచేసి పార్టీ ఏర్పాటుచేసిన అతి తక్కువరోజుల్లోనే రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకుని, ప్రజలకు సంక్షేమ పథకాలు అమలుచేశారన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

**-కంకణాల ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి...:**

టిడిపి వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ జయంతిన మంగళవారం పెద్దకాపులేఔట్‌లో యూనిట్ ఇన్‌ఛార్జి కంకణాల రజినీకాంత్‌నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగుజాతి గర్వించదగిన నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. కేక్‌కట్‌చేసి టిడిపి నాయకులు కంకణాల రజినీకాంత్‌నాయుడు, ఆర్‌సి మునికృష్ణ, దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, ఈతమాకుల హేమంత్‌యాదవ్, జలపోతు చంద్ర, దినేశ్, రాయపాటి రెడ్డప్ప, రాఘవేంద్ర, భరణి యాదవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి

**పుత్తూరు, మే 28 ప్రభాతవార్త :**



దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 101వ జయంతిని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించి వారికి రాజకీయ అధికారం కల్పించారని తెలిపారు. సినీ రంగంలోనే కాకుండా రాజకీయాల్లో కూడా తనదైన ముద్ర వేసుకున్న కారణజన్ముడని కొనియాడారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రావిళ్ల మాధవనాయుడు, కరుణ యాదవ్, బొబ్బిలి యాదవ్, గాలి గోపినాథ్, ఆనంగి ఆనంద్, కరుణాకరన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజలకు ఎన్టీఆర్ చిరస్మరణీయుడు

**విజయ్‌బాబు**

**పుత్తూరు, మే 28 ప్రభాతవార్త :**



తెలుగు ప్రజల ఖ్యాతిని నలుదిశలా చాటి చెప్పిన దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తెలుగు ప్రజలకు చిరస్మరణీయుడని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. మంగళవా రం ఎన్టీఆర్ జయంతిని పట్టణంలోని ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రజల వద్దకు పాలన, మహిళలకు ఆస్తి హక్కు చట్టబద్ధం వంటి విప్లవాత్మక చర్యలతో ఉత్తమ పరిపాలన అందించారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గెరటాల ధనపాల్, సూపర్‌బజార్ ఛైర్మన్ చంద్ర యాదవ్, నాయకులు దాసరి విజయ్‌చౌదరి, ప్రవీణ్ నాయుడు, జె.కె.మేఘనాథ్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక విద్యార్థులకు భవితలో నమోదు

**పుంగనూరు,మే 28 ప్రభాతవార్త :**



మండల,పట్టణ ప్రాంతాలలోని ప్రత్యేక ప్రతిభావంతులైన బడిఈడు పిల్లలను భవిత కేంద్రంలో చేర్చుకునే నమోదు కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని ప్రత్యేక ఉపాధ్యాయుడు వెంకటరమణ తెలిపారు. మండల విద్యాశాకాధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టిల సూచనలతో ఇప్పటికే పలు ప్రంచాయతీలు గ్రామాలలో ఇంటింటా సర్వేలు నిర్వహించి,ఇళ్ళలోనే ఉండిపోయిన ప్రత్యేక ప్రతిభావంతులైన విదా ్యర్థుల నమోదు చేపట్టామన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి తొమ్మిది మందిని భవితలో చేర్చామన్నారు. జూన్ 9వరకు నమోదు కార్యక్రమాలు నిర్వహిసా ్తమని, భవితలో చేరే విద్యార్థు లకు వారి వైకల్యస్థాయిలను అధిగమించేందుకు శిక్షణలు, ప్రత్యేక ఫిజియోథెరపీ, తమ దైనందిక అవసరాలను తెలియచెప్పే విధానాలను పూర్తిగా నేర్పుతామన్నారు. కార్యక్రమాలలో ప్రత్యేక ఉపాధ్యాయిని అరుణ,ఎమ్మార్సీ సిబ్బంది శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్‌టీఆర్‌కు నివాళి

**కేవీబీ పురం మే 28 ప్రభాతవార్త:**



ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకుల పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం, పలువురు నాయకులు, కార్యకర్తలు అమరహే అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రామానుజుల నాయుడు, గోపినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అవసరం మునికృష్ణయ్య, సురేష్‌రెడ్డి, వెంకట కృష్ణయ్య, చెంగారెడ్డి, కృష్ణయ్య, శివరావు, పరందామిరెడ్డి, కేశవులనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్‌టీఆర్ జయంతి

**విజయపురం, మే 28 ప్రభాతవార్త:**



మండలంలో మంగళవారం ఎన్‌టీఆర్ జయంతి సందర్భంగా పన్నూరు సబ్‌స్టేషన్ మండల టీడీపీ పార్టీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయ యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మహేంద్రన్, నాయకులు దశరథరాజు, శివలింగం, చిన్నబ్బరాజు, తులసిరాజు, గుణమ్మ, సుధాకర్‌నాయుడు, శివయ్యనాయుడు, కపిల్, గుణశేఖర్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, మురళి, సుధాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయపురం దళితవాడలో కాటన్ సర్చ్

**విజయపురం, మే 28 ప్రభాతవార్త:**



మండలంలోని విజయపురం దళితవాడలో మంగళవారం కాటన్ సర్చ్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో నాలుగు పక్కల పోలీసులను పెట్టి నాటుసారా, ఊటలను పరిశీలించారు. గ్రామంలో ద్విచక్రవాహనాలను తనిఖీ నిర్వహించి రికార్డులు లేని వాటిని సీజ్ చేశారు. గ్రామంలో స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించాలని, మద్యంకు దూరంగా ఉండాలని సీఐ సుబ్బరామారెడ్డి సూచనలు ఇచ్చారు.ఎస్‌ఐలు జయప్ప(విజయపురం), శ్రీనివాసులు(నింద్ర), పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గంగజాతరకు భారీ బందోబస్తు : సీఐ

**అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనం**

**సత్యవేడు, మే 28 ప్రభాతవార్త:**



సత్యవేడులో బుధవారం నుంచి మొదలయ్యే గంగమ్మజాతరకు భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని సత్యవేడు సీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలకు కూడా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. సత్యవేడు సరిహద్దు ప్రాంతాల్లో కూడా ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆ తరువాతే వాహనాలను పట్టణంలోకి అనుమతించడం జరుగుతుందన్నారు. అమ్మవారిని కొలువు చేసే ప్రాంతమైన గంగమిట్ట వద్ద కూడా భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని దర్శించుకోవడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ముగ్గురు సీఐలు, 9 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 30 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 120 మందిపోలీసు కానిస్టేబుళ్లు, 20 మంది సీఆర్‌ఎఫ్ పోలీసు సిబ్బంది బందోబస్తును వినియోగించుకుంటున్నట్లు సీఐ వెల్లడించారు. అవసరమైతే శ్రీసిటీ డీఎస్పీ ఫైడేశ్వరరావు, అక్కడి నుంచి సిబ్బందిని కూడా దిగుమతిచేసుకోవడం జరుగుతుందని ఆయన వివరించారు. శుక్రవారం వేకువ జామున జరిగే అమ్మవారి నిమజ్జనం కార్యక్రమం వరకు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## కైలాసగిరి పర్వత పంక్తుల్లోని అనుబంధ ఆలయాలకు మహర్దశ

**హర హర తీర్థం పనులను పరిశీలించిన ఛైర్మెన్**

**శ్రీకాళహస్తి,మే 28 ప్రభాతవార్త**



పట్టణానికి సుమారు 5కిలో మీటర్ల దూరంలో పర్యాటక ప్రాధాన్యత కలిగిన కోన హరహార తీర్థంలో రూ.45లక్షలతో నిర్మిస్తున్న స్వామి అమ్మవార్ల ఆలయ పనులను మంగళవారం ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. 45రోజుల్లో పనులు పూర్తి చేసి కుంబాభిషేకానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కైలాసగిరి పర్వత పంక్తుల్లో వెలసిన ఆలయాలకు మహర్దశను కల్పిస్తున్నారు. రెండేళ్ళ క్రితం వరకు శిధిలావస్థకు చేరుకొని నేలమట్టం అవుతున్న ఆలయాలను గుర్తించిన ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించి జీర్ణోద్ధారణకు సూచించారు.ఈ నేపధ్యంలో పురాణ ప్రసిద్ధి చెందిన 'హర హర తీర్థంలో అమ్మవారి ' ఆలయం ఉంది. ఇది శిధిలావస్థకు చేరుకుంది. పలుమార్లు దుండగులు గుప్త నిధుల కోసం మూలవిరాట్లును తవ్వేసారు.ఈ దుస్థితిని గుర్తించిన ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు స్పందించారు. జీర్ణోద్ధారణ పనులు చేపట్టారు.

**ప్రాధాన్యత పెరిగిన హర హర తీర్థం:**

శ్రీకాళహస్తీశ్వరునికి కైలాసగిరుల్లో సుమారు 21 కిలోమీటర్ల మేరకు అస్తులున్నాయి. ఇందులో ఎన్నో పురాణ ప్రసిద్ధి చెందిన కోనలు, ఆలయాలున్నాయి. ఈ నేపధ్యంలో హర హర తీర్థం పట్టణానికి ఐదు కిలో మీటర్ల దూరంలో ఉంది. ఈ తీర్థం ఎంతో ప్రాశస్త్యమైంది. 2007 నుంచి సమీపంలో రాజీవ్‌నగర్ ఏర్పడింది.ఈ ప్రాంతానికి కోన ఎంతో దగ్గరగా ఉంటుంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన కోనలో పురాతన కాలం నాటి శివాలయం ఉండేది. అది శిధిలమైంది.ఇది గమనించిన ఛైర్మెన్ ఆలయాన్ని పూర్తిగా తొలగించి రూ.45లక్షల ప్రాథమిక అంచనాలతో స్వామి అమ్మవార్ల ఆలయ నిర్మాణాన్ని చేపట్టడానికి తీర్మానించారు.పనులు శరవేగంగా సాగుతున్నాయి. పరిశీలనలో ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బాలాజి, దేవస్థానం సిబ్బంది సుదర్శనం రెడ్డి, కామేశ్వరరావు, కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ జయంతి కూడా ఓ పండుగ

**-బొజ్జల బృందమ్మ**

**శ్రీకాళహస్తి, మే 28 ప్రభాతవార్త**



తెలుగువారికి సంక్రాంతి పండుగ ఎంతో తెలుగుదేశంపార్టీ వారికి ఎన్టీఆర్ జయంతి కూడా ఓ పండుగ అని దివంగతనేత బొజ్జలగోపాల కృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ అన్నారు. ఎన్టీఆర్ 101 సందర్భంగా పట్టణంలోని ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ ఆధ్వర్యంలో భారీకేక్ కట్‌చేసి తెదేపా శ్రేణులకు, నాయకులకు పంపిణీచేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం నాయకులతో కలసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి కేక్‌కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీచేశారు. శ్రీకాళహస్తిలో జరిగిన కార్యక్రమాల్లో మాజీ కౌన్సిలర్ శెంజిగరం సుప్రజ, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, పార్లమెంటు నాయకుడు రంగినేని చెంచయ్యనాయుడు రాష్ట్ర సాంస్కృతిక రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకమ్మ, ఇందిరాపవార్, శ్రీలక్ష్మి, మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు వాకచర్లగురప్పశెట్టి, మాజీ పాలసరఫరా ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు, బిజెప్రసాద్, ఆర్ముగం పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధ్యతతో ప్రజలకు సేవలందించండి : ఎంపిడిఓ

**తొట్టంబేడు, మే 28 ప్రభాతవార్త**



సచివాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది బాధ్యతగా సేవలందించాలని ఎంపిడిఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్టత్తూరు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి వందశాతం బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలని సూచించారు. ఎవరైనా సాధారణ సెలవు పెట్టినట్లయితే సంబందిత అధికారి వద్ద సెలవు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో త్రాగునీరు పారిశుధ్యం వాటిపై దృష్టిసారించాన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఇన్‌ఛార్జి కార్యదర్శి అంకయ్య మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నిమ్మకూరులో ఎన్టీఆర్ దంపతులకు నివాళులు

**శ్రీకాళహస్తి, మే 28 ప్రభాతవార్త**



ఎన్టీఆర్ 101 జయంతి సందర్భంగా కృష్ణాజిల్లా నిమ్మకూరులోని ఎన్టీరామారావు స్వగ్రామంలో ఉన్న ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు శ్రీకాళహస్తి టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్ డివి.నారాయణ పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# తిరుపతి డివిజన్

## కల్యాణవేంకటేశ్వరుని కల్యాణోత్సవానికి పట్టుసారె వితరణ

**నారాయణవనం, మే 28 ప్రభాతవార్త :**

నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన టిటిడి ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు మంగళవారం రాత్రి జరిగిన కల్యాణోత్సవానికి సంబంధించి నారాయణవనం పట్టుశాలి కులస్తులు పట్టుసారెను ఊరేగింపుగా తీసుకెళ్లి అందజేశారు. ఎ సాంప్రదాయం ప్రకారం తరతరాలుగా బ్రహ్మోత్సవం సమయంలో జరిగే కల్యాణోత్సవానికి పట్టుశారేను అందజేయడం ఆనవాయితీగా వస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీవంశస్తులు అచ్చుకట్ల హరి, ఆర్టీసి పెరుమాల్, ఎస్‌ఎస్.గిరిబాబు, తిరుమలశ్రీనివాసులు, శంకర్, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

## పద్మాశాలీ వంశస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం

**నారాయణవనం, మే 28 ప్రభాతవార్త :**

కల్యాణ వేంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు మంగళవారం జరిగిన రథోత్సవం, కల్యాణోత్సవం సందర్భంగా జిల్లా పద్మాశాలీ వంశస్తుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం వేలాదిమంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాయలసీమ పద్మాశాలీ వంశస్తుల ఆధ్వర్యంలో ప్రతి ఏటా అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తున్నది. అలాగే మంగళవారం రాత్రి జరిగిన కల్యాణోత్సవం సందర్బ ంగా పట్టుసారెను ఎగువపదా ్మశాలీవీధిలోని భద్రావతీ సమేత భావనారుషీ ఆలయం నుంచి మంగళవాయిద్యాలు నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి టిటిడి అధికారులకు అందించారు.

## ఆదర్శప్రాయుడు ఎన్టీ రామారావు

**తిరుపతిరూరల్, మే 28 ప్రభాతవార్త:**



దివంగత ఎన్టీ రామారావు ఆదర్శప్రాయుడని తెలుగుదేశం పార్టీ నాయకులు దొడ్ల కరుణాకర్‌రెడ్డి అన్నారు. ఎన్.టి.ఆర్, జయంతిని పురస్కరించుకుని మంగళవారం తుమ్మలగుంట పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్.టి.ఆర్. చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కృష్ణారెడ్డి, రాధరాయల్, చంగల్ రామానాయుడు, సిద్దారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీను, సుబ్రమణ్యం రాయల్, శ్రీనివాసులు రాయల్, నవీన్ కృష్ణ, చెంచుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నగరిలో ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి

**నగరి, మే 28 ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని మంగళవారం నగరిలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎన్టీరామారావుకు ఘనంగా నివాళి

**వడమాలపేట, మే 28 ప్రభాతవార్త:**



ప్రముఖ నటుడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వడమాలపేటలోని పార్టీ కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు ధనంజయనాయుడు, వెంకటయ్య, హేమావతి, లక్ష్మీప్రసన్న, రఘు, శేషాద్రి యాదవ్, రామమూర్తి, పెద్దబ్బ రాజు, రవి, బత్తెయ్య, శివరాయల్, అదెయ్య, మస్తాన్, బాలకృష్ణ, శేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగువారి ఆత్మగౌరవం ఎన్‌టీఆర్ : ఎంజీ రెడ్డి

**రేణిగుంట, మే 28 ప్రభాతవార్త:**



ఎన్‌టీఆర్ జయంతిని పురస్కరించుకుని ముందుగా రేణిగుంట ఎంజీ రెడ్డి కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీ గంగమ్మతల్లి ఆలయం వద్ద నిరుపేదలకు ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తెలుగు ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, టీడీపీ నేతలు జగన్, పవన్, టైలర్ నరసింహులు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్ష కోచింగ్‌కు అగ్రగామి

**తిరుపతి విశ్వం విద్యా సంస్థలు**

**తిరుపతి క్రీడ, మే 28, ప్రభాతవార్త**



స్థానిక వరదరాజ నగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్ నందు విశ్వం సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల స్టడీ మెటీరియల్స్‌ను ఎంఎల్సి, అప్పుస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎంవీ రామచంద్ర రెడ్డి, విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 2024 సైనిక్ స్కూల్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు 60కు పైగా సీట్లను, నవోదయ ఫలితాల్లో 42 సీట్లు సాధించి విజయభేరి మోగించారని తెలిపారు. విశ్వం విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా సైనిక్ ఫలితాల్లో 41 రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులతో పాటు 910 సీట్లు సాధించి కోచింగ్ చరిత్రలో రికార్డు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ తులసీ విశ్వనాథ్, అప్పుస్మా రాష్ట్ర నాయకులు సంజీవ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొని స్టడీ మెటీరియల్స్‌ను ఆవిష్కరించారు. ఈ పోటి పరీక్షలకు సంబంధించి మరింత సమాచారం కొరకు 8688888802, 9399976999 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

## వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- గ్రంథాలయ అధికారిణి మీనాకుమారి**

**పుత్తూరురూరల్, మే 28 ప్రభాతవార్త:**



పుత్తూరులోని గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిబిరాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారిణి మీనాకుమారి తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 తేదీ వరకు గ్రంథాలయంలో పిల్లలకు ఆటపాటల్లో కూడిన విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు. సమ్మర్ క్యాంపులో పిల్లలతో ఆటలు ఆడించడం, చిత్రలేఖనం, క్రాఫ్ట్ డిజైనింగ్, కథలు చెప్పించడం, కథలు రాయించడం, స్పోకెన్ ఇంగ్లీష్, పాటలు నేర్పించడం చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పరిశుభ్రమైన వంటను విద్యార్థులకు వండి పెట్టాలి : ఎంఈవో

**కేవీబీ పురం, మే 28 ప్రభాతవార్త:**

పాఠశాలల్లోని విద్యార్థులకు పరిశుభ్రమైన వంట చేసి వడ్డించాలని ఎంఈవోలు లక్ష్మీపతి, రవికుమార్‌లు తెలిపారు. మండల కేంద్రమైన కేవీబీపురంలోని కేజీబీవీ పాఠశాలలో మండలంలోని 74 పాఠశాలలకు సంబంధించిన వంట కార్మికులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పీఎంజీవై కింద ఎలాంటి మెను వాడాలనే ప్రకారం రోజు నిత్యం చేసే వంటకాలను పరిశుభ్రంగా చేయించాలని, పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తలకు గ్లౌజులు వాడాలని, విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన మెను ప్రకారం రోజువారి పదార్థాలను కచ్చితంగా వాడాలన్నారు. ఆరోగ్య పరిశుభ్రత వంట విధానాలు తయారు చేయు విధానాలు మెను ఎలా వాడాలి అన్న విషయాలపై ఎంఈవోలు వివరించారు. వంట కార్మికులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా మాకు రావాల్సిన బిల్లులు రావడం లేదని వాపోయారు. నెలలో రెండు నెలల బిల్లు పెట్టిస్తామని మార్చి, ఏప్రిల్ నెలది ప్రభుత్వానికి నివేదికలు అందించి తక్షణమే అందించేందుకు చర్యలు చేపడతామని వారు తెలిపారు. సమావేశంలో సీఆర్పీలు రవికుమార్, దేవసేన, ప్రమీల, వంట కార్మికులు, పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**నారాయణవనం, మే 28 ప్రభాతవార్త :**

మండలంలోని స్థానిక సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని పంక్షన్ హాల్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరితారకరామారావు 101 జయంతి వేడుకలను మంగళవారం ఘన ంగా జరుపుకున్నారు. సత్యవేడు ఎమ్మెల్యే, టిడిపి అభ్యర్థి కోనేటి ఆదిమూలం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో ఓట్ల లెక్కింపు

**- ఉదయం 6 గంటలకల్లా ఏజెంట్ల హాజరు తప్పనిసరి - చిత్తూరు నియోజకవర్గ ఆర్ఓ పి.శ్రీనివాసులు**



పార్టీల ప్రతినిధులతో సమావేశమైన జాయింట్ కలెక్టర్

చిత్తూరు, మే 28 (ప్రభాతవార్త): కౌంటింగ్ ఏజెంట్లు, అభ్యర్థుల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని చిత్తూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. జెసి సమావేశపుహాలులో మంగళ వారం జెసి శ్రీనివాసులు జూన్ 4వ తేదీ జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ మే 13న పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని, జూన్ 4న ఓట్ల లెక్కింపు సైతం ప్రశాంతంగా నిర్వహించాలని ఏజెంట్లు, అభ్యర్థులు సహకారం అందించాలన్నారు. చిత్తూరు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు సంబంధించి 14 టేబుల్స్, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు మూడు టేబుల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక ఏజెంట్ చెప్పున 14 టేబుళ్ళకు 14 ఏజెంట్లను నియమించు కోవాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు 4వ తేదీ ఉదయం 6 గంటలకల్లా ఎస్వీసెట్ కౌంటింగ్ కేంద్రంకు చేరుకోవాలన్నారు. 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్, ఇవిఎంల ద్వారా ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించడం జరుగుతుంద న్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని, సెల్ ఫోన్లు డిపాజిట్ చేయడం కోసం గేటు వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కంట్రోల్ యూనిట్ ద్వారా ఓట్ల లెక్కింపుకు సంబంధించి అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను రెండు సార్లుగా తెలియ జేయడంతో పాటు కౌంటింగ్ కేంద్రంలో డిస్ప్లే బోర్డుల్లో సైతం రౌండ్ వారీగా ఓట్ల వివరాలను తెలియజేయడం జరుగుతుం దన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ షేక్ హసినాబీ, ఎన్నికల సూపరింటెండెంట్ రాజన్, డిటి కిరణ్, ఎలక్షన్ డిటి హిమగిరి, తెలుగుదేశం నాయకులు బివిఎన్. రాజసింహులు, వైఎస్ఆర్‌సిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్, ఇతర పార్టీల నాయకులు బికె రమణారెడ్డి, రియాజ్‌భాషా, పురుషోత్తం, ప్రభాకర్‌రెడ్డి, మోహన్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మల్టీలెవల్ కార్ పార్కింగ్ పనులు పూర్తి చేయండి

**విధి నిర్వహణలో తగు జాగ్రత్తలు పాటించండి -కమిషనర్ అదితి సింగ్**



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అదితి సింగ్

తిరుపతి కార్పొరేషన్, మే 28 (ప్రభాతవార్త): మల్టీలెవల్ కార్ పార్కింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని అన్నారావు కూడలి, యశోధనగర్, భవాని నగర్, తిలక్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, సుబ్బలక్ష్మి కూడలి, డీబార్ మహల్, ఎయిర్ బైపాస్ రోడ్డు, రైతు బజార్, ఆర్‌సి రోడ్డు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. అక్కడక్కడ రోడ్లపైన, దుకాణాల వద్ద చెత్త ఉండడంతో అపరాధ రుసుము వసూలు చేయాలని హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్‌ను ఆదేశించారు. మురుగు కాలువల్లో చెత్త తొలగించే వారు బూట్లు, చేతులకు గ్లౌజ్‌లు వేసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రోడ్లపైనే, కాలువల్లో చెత్త వేయకుండా చూడాలన్నారు. ప్రజల్లో కూడా అవగాహన పెంచాలని అన్నారు. తమ ఇండ్ల వద్దకు వస్తున్న వాహనాల వారికి తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించి నగర శుభ్రతకు సహకరించాలని కమిషనర్ అదితి సింగ్ ప్రజలను కోరారు. అనంతరం రైల్వే స్టేషన్ సమీపంలో నిర్మాణంలో వున్న మల్టి లెవల్ కార్ పార్కింగ్ భవన నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. ఏడు అంతస్తుల్లో నిర్మిస్తున్న ఈ భవనంలో రెండు సినిమా హాల్లు, ఒరెండు షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఫుడ్ కోర్టుతో పాటు 296 కార్లు పార్కింగ్ చేసేలా ఈ భవనం నిర్మిస్తున్నామని అధికారులు వివరించారు. పనులు ఆలస్యంగా జరుగుతుండడం, ఇచ్చిన గడువు లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ రాజు, ఏఈకాం ప్రతినిధి బాలాజీ తదితరులు ఉన్నారు.

# తగ్గని రాహుకేతుదోష నివారణ పూజలు

**మంగళవారం అయినా రద్దీయే రద్దీ**



శ్రీకాళహస్తి,మే 28 ప్రభాతవార్త : దక్షిణ భారత దేశంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి.మంగళవారం ఆలయం భక్తులతో కిట కిట లాడింది.మంగళవారం అయినా భక్తుల సంఖ్య తగ్గటం లేదు.ముఖ్యంగా రాహుకేతుదోష నివారణ పూజలకు రద్దీ తగ్గటం లేదు. మంగళవారం అయినా 5వేల పూజలు జరగటం గమనించదగ్గ విషయం. ఓ వైపు ఎండలు దడపుట్టిస్తున్నా లెక్క చేయక హాజరయ్యారు. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పూజల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు.దాంతో రద్దీ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజల కోసం భక్తులు నిరీక్షించారు.ఉదయం నుంచి ఆలయంలోనూ, పట్టణంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది.దేవస్థానం అందించిన సమాచారం మేరకు మంగళవారం కూడా సుమారు 25వేల మంది దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆలయంలో రద్దీ పెరుగుతుందని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇఒ వివరించారు.ముఖ్యంగా ఆలయంలో నిర్వహించే అభిషేకాలకు రద్దీ చోటు చేసుకుంది.ప్రత్యేకదర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు 3120 మంది కాగా రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు ఐదువేల మంది జరిపించుకున్నారు. అభిషేకాలకు రద్దీ ఏర్పడింది. 72 మంది అభిషేకాలు జరిపించుకోగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు 32 జరిగాయి.శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు భక్తులకు ఉక్కపోత లేకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఒక్కొక్క క్యూలైన్‌కు ఒక్కొక్క కూలర్‌ను ఏర్పాటు చేసారు.అలాగే స్వామి అమ్మవార్ల గర్భగుడి లో ఎసిలు బాగా పని చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇక దళారుల ఆటకట్టించుటకు ఇటు ధర్మకర్తల మండలి అటు అధికారులు ఎన్నో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నా, ఆచరణలో అమలు జరగటం లేదు.

**రాహుకేతు పూజలకు నిరీక్షణ:**

మంగళవారం ఉదయం నుంచి ఎండలను సైతం లెక్క చేయక రాహుకాల సమయంలో పూజలు చేయించుకొవటానికి వచ్చిన భక్తులు ఎండలను లెక్క చేయలేదు. పూజలకు హాజరయ్యారు..ఈ మేరకు ఏర్పాట్లు చేశామని ఇఒ వివరించారు. ప్రతి రోజూ కనీసం 20వేలు తగ్గటం లేదు. దాంతో ఆలయ ఆదాయం గణనీయంగా పెరుగుతుంది.

# తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి 'ఎన్టీఆర్'

**- ఎన్టీఆర్ ఘాట్‌లో నివాళులర్పించిన దగ్గుమళ్ల**



చిత్తూరురూరల్, మే 28 ప్రభాతవార్త: తెలుగుజాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి, నవశకానికి నాంది పలికిన శిఖరం నందమూరి తారకరామారావు అని ఎన్డీఏ కూటమి చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కొనియాడారు. మంగళ వారం హైదరాబాదులోని ఎన్టీఆర్ ఘాట్ లో ఎన్డీఏ కూటమి చిత్తూరు పార్లమెంట్ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద రావు ఆ మహనీయుని జయంతిని పురస్కరించుకొని పుష్పాలు సమర్పించి ఘననివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల వర్గాల అభ్యున్నతిని దృష్టిలో వుంచుకొని సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసిన నిజమైన ప్రజాసేవకులు తారకరామారావులని, ఆయన అడుగుజాడల్లో నడవమే పేదరికం లేని సమాజ ఆవిష్కరణకు ఏకైక మార్గమని పేర్కొన్నారు.

# బ్రతుకు జాట్కా బండి నడవాలంటే తప్పదు... మరి ఈ జీవన పోరాటం

వెంకటగిరి, మే 28 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం గిరిజనలను అర్ధికంగా అభివృద్ధి చేయాలనే దృఢసంకల్పం పాలకుల లోపామా లేకా అధికారులు నిర్లక్ష్యమా తెలియదు కాని గ్రామీణ ప్రాంతలల్లో గిరిజనులు బ్రతుకు జాట్కా బండి నడపలంటే ప్రతి నిత్యం తమ భార్య పిల్లలుతో కలసి కష్ట పడి పనిచేయనిదే డొక్క నిండని దుస్థితి నోలకోని ఉంది.జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజనలల్లో కనీసం కొద్ది శాతం మాత్రమే అర్ధికంగా అభివృద్ధి చెంది ప్రభుత్వ ఫలాలను పొందగలుగుతున్నారు. మిగిలినవారు మాత్రం అడవికి వెళ్ళి కట్టెలు కొట్టుకోని జీవించడం లేదా చేపల వేటకు వెళ్ళి పొట్ట నింపుకోవడం అదీకాక పోతే చేత్తా కాగాతాలు వేరుకోని అమ్ముకోని వాటితో వచ్చి కొద్ది డబ్బులుతో చాలిచాలని తిండితో కాలం వెళ్ళబుచ్చుతు తమ బ్రతుకు జాట్కా బండిని నడుపతు జీవనం కొనసాగిస్తున్నరు. వెంకటగిరి నియోజకవర్గంలోని ఇంకా మండలాల్లోని కొన్ని గిరిజన కాలనీలల్లో ఇదే పరిస్థితి నేలకొని ఉంది. ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు,పాలకులు చొరవ తీసుకోని గిరిజన జీవితాలల్లో వెలుగు నింపే విధంగా చర్యలు చేపట్టాలని కోరతున్నారు.



నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా రాత్రి అశ్వవాహనంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



చిత్తూరు, మే 28 ప్రభాతవార్త: జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలు జిల్లా పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు సిఆర్ రాజన్, చిత్తూరు పార్లమెంటు 'దేశం' అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు తనయుడు రాధేయ్ నేతృత్వంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా దేశం అధ్యక్షుడు సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్. రాజసింహులు, మాజీ ఎమ్మెల్యే ఎఎస్ మనోహర్, మాజీ మేయర్ కఠారి హేమలత, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు తనయుడు రాధేయ్‌లు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకటీల సురేంద్రకుమార్, జిల్లా పార్టీ మాజీ కార్యదర్శి చంద్రప్రకాష్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోందడయాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, యాదవ సాధికార సమితి టిడిపి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, జిల్లా బిసీ ప్రధాన కార్యదర్శి శంకర్, దేశం నాయకులు శేషాద్రినాయుడు, యువరాజులు, విజయ్‌కుమార్, ఉదయ్‌కుమార్, దళపతి, మైనార్టీ విభాగం నాయకులు ఫిరోజ్‌ఖాన్, జాఫర్, మాజీ కార్పొరేటర్లు కందా, ప్రసాద్, రాణి, సిఎం విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఐరాలలో వైభవంగా శ్రీపాలేటమ్మ జాతర



ఐరాల, మే 28 ప్రభాతవార్త: మండల కేంద్రం ఐరాలలో గార్గేయనదీ తీరంలో వెలసిన శ్రీపాలేటమ్మ జాతర మంగళవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ప్రతి ఏటా ఆలయంలో శ్రీపాలేటమ్మ జాతర వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈమేరకు మంగళవారం శ్రీపాలేటమ్మ ఆలయంలో 47వ గంగ జాతర వేడుకలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంకె.బాలాజి ఆధ్వర్యంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామున 3 గంటలకు అమ్మవారి శిరస్సు ప్రతిష్టించారు. అనంతరం సుమారు 6 గంటలకు అమ్మవారికి తెరతీసి తొలిపూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి అంబలిపోసి, మహిళలు పెద్దఎత్తున పొంగళ్ళు పెట్టి, చీరసారెలు సమరి ్పంచి జంతుబలులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈజాతర వేడుకల్లో ఐరాల పరిసర గ్రామాలకు చెందిన భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. భక్తుల కాలక్షేపం నిమిత్తం ఉదయం నుండి రాత్రి వరకు పిల్లగ్రోవి, చెక్కభజనలు, పండరి భజనలు, గెరిగ నృత్యాలు, డాన్స్‌బేబి డాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే భక్తులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈవేడుకల్లో శ్రీపాలేటమ్మ యువజన సంఘం, భక్తులు పాల్గొన్నారు.ఇదిలా వుండగా పాలేటమ్మ జాతర సందర్భంగా పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# 30న కాణిపాకం ఆలయ హుండీల లెక్కింపు

కాణిపాకం, మే 28 ప్రభాతవార్త కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 30 హుండీల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. స్థానిక ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు జరిగే హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొనాలని తెలిపారు.

# శ్రీప్రసన్న రంగనాధ స్వామి బ్రహ్మోత్సవాలు... నేటి నుండి ప్రారంభం



తిరుపతిరూరల్, మే 28 ప్రభాతవార్త: కలియుగ వైకుంఠమగు తిరుమల తిరుపతికి ఆగ్నేయ దిశన అలిమేలు మంగాపురం నుండి సుమారు 5కిలోమీటర్ల దూరంలో అప్పలాయగుంటకు వెళ్ళే మార్గమధ్యన వున్న బ్రాహ్మణపట్టు గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న రంగనాధ స్వామి, శ్రీదేవి, భూదేవి సమేతంగా వెలసియున్న విషయం తెల్సిందే. అక్కడే శ్రీ భవానీ శంకర మూర్తి ఆలయం కలదు. తిరుపతిరూరల్ బ్రాహ్మణపట్టులో వెలసిన శ్రీప్రసన్న రంగనాధ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుండి జూన్ 6వ తేదీ వరకు జరుగునని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 30న గురువారం ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం హంసవాహనం, 31న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, జూన్01వ తేదీన శనివారం ఉదయం శేష వాహనం, సాయంత్రం స్వామివారి కళ్యాణోత్సవం, 2వ తేదీన ఉదయం హనుమంత వాహనోత్సవం, సాయంత్రం గరుడోత్సవం, 3వ తేదీన ఉదయం సింహ వాహనోత్సవం, సాయంత్రం గజ వాహనోత్సవం, 4వ తేదీన ఉదయం రథోత్సవం, సాయంత్రం అశ్వ వాహనోత్సవం, 5వ తేదీ ఉదయం పుష్పయాగం, సాయంత్రం శయనోత్సవం నిర్వహించబడునని తెలిపారు.

# గంగమ్మ ఆశీస్సులందుకోండి

**-తొలి మంగళవారం పూజల్లో రాయలసీమరంగస్థలి**



తిరుపతి,మే 28ప్రభాతవార్త: తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులందు కోవాలని రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి కోరారు. జాతర ముగిసిన తరువాత ఐదువారాలు జరిగే మినీ జాతర మహోత్సవంలో భాగంగా తోలి మంగళవారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు గుండాల గోపీనాథరెడ్డి, కెఎన్ రాజ, మేకల కోదండపాణి, గంగయ్య, ఎస్వీఎం వెంకటేశ్ తదితర కళాకారులు వివిధ వేషధారణలతో గంగమ్మను దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. తొలిమంగళవారం తాతయ్యగుంట గంగమ్మను వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు.

# అన్నమయ్యజయంతి ఉత్సవాలు



తిరుపతి అన్నమాచార్యప్రాజెక్టు ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో జ్యోతి ప్రజ్జ్వలన.ఈ కార్యక్రమంలో చిన్న వీరభద్రుడు, డాక్టర్ రఘునాధశర్మ, శ్వేత సంచాలకుడు భూమన్.

ప్రభాతవార్త-తిరుపతి

# మహిళల ఖాతాల్లో జమ అవుతున్న చేయూత నగదు

కుప్పం, మే 28 ప్రభాతవార్త : ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన 45-60 ఏళ్లలోపు మహిళలకు ప్రభుత్వం అమలు చేసిన చేయూత పథకం నగదు మహిళల ఖాతాల్లోకి జమ అవుతోంది. దీంతో మహిళలు సంబరపడుతున్నారు. ఈ ఏడాది మార్చి 7వతేది సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేయూత పథకంకు సంబంధించి మహిళల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు బటన్ నొక్కిన విషయం విదితమే. అనంతరం ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం జరిగింది.ఎన్నికలకు ముందు మహిళల ఖాతాల్లో నగదు జమ చేసేందుకు అవకాశం లేకపోయింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఎన్నికలు ముగిశాక ఈనెల 14వతేది తర్వాత సంక్షేమ పథకాల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయవచ్చని సూచించిన విషయం విదితమే. దీంతో చేయూత పథకంలో అర్హులైన మహిళలకు వారివారి బ్యాంకు ఖాతాల్లో రూ 18750లు వంతున నగదు జమ అవుతోంది. ఈమేరకు లబ్ధిదారులకు ఫోన్‌లో నగదు జమ చేసినట్లు మెసేజులు వస్తుండడంతో మహిళలు బ్యాంకుల వద్దకు పరుగులు తీస్తున్నారు.అదే విధంగా ఆసరా పథకం డబ్బులు సైతం మహిళల ఖాతాల్లో జమ అవుతోంది. ఓ పక్క ఎన్నికల తాయిలాలు చేతికి అందడం మరో పక్క సంక్షేమ పథకాల డబ్బులు కూడా మహిళల ఖాతాల్లోకి జమ అవుతుండడంతో మహిళలు లోలోపల సంతోషపడుతున్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపే లక్ష్యం

**- చిత్తూరులో పోలీసుల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్, మాబ్ ఆపరేషన్ నిర్వహణ**



చిత్తూరు, మే 28 ప్రభాతవార్త: చిత్తూరు ఎస్వీ సెట్ కళాశాల ఓట్ల లెక్కింపు కేంద్రంలో జూన్ 4వ తేదీ జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో పూర్తి అయ్యేలా పోలీసు శాఖ పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు నగర పరిధిలో గాంధీ విగ్రహం కూడలిలో ఎస్పీ మణికంఠ చందోలు సమక్షంలో ఏఆర్ ఎఎస్పీ జి.నాగేశ్వరరావు, చిత్తూరు డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డిల నేతృత్వంలో మంగళవారం పోలీసులు మాక్ డ్రిల్, మాబ్ ఆపరేషన్లు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా ఎదైనా అవాంఛనీయ సంఘటనలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటే, అల్లరి మూకలు విధ్వంసానికి పాల్పిడితే, ఎవరైనా చట్ట విరుద్దమైన సమావేశాలు నిర్వహిస్తే వారిని పోలీసులు ఎలా ఎదర్కొంటారనే విషయంపై ఏఆర్ పోలీసులు, ఎస్‌టిఎఫ్ సిబ్బంది మాబ్ ఆపరేషన్, మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అల్లర్లు, ఆందోళనలు, విధ్వంసంకు పాల్పడితే పోలీసులు తీసుకునే చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించి పోలీసులు వివరించారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాధరెడ్డి, టుటౌన్ ఇన్స్‌పెక్టర్ ఉలసయ్య, ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కుల్లయ్యప్ప, వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ కోళ్ళంటే విషసర్పాలకు హడల్...!



చౌడేపల్లి, మే 28 ప్రభాతవార్త : ఈ కోడి కూత వినగానే రంధ్రంలోవుండే విషసర్పాలు సైతం హడలెత్తి పోతాయి. దీంతో కోళ్ళకు గిరాకీ పెరిగింది. టర్కీకోళ్ళుగా పిలవబడే తొండ్లంకోళ్ళను పలు గ్రామాల్లో విషసర్పాల నుంచి రక్షణ కోసం పెంచు కొంటున్నారు. గ్రామానికి దూరంగా వున్న గృహాలు, పట్టణ శివార్లలో ఈ కోళ్ళు దర్శనమిస్తున్నాయి. విషసర్పం ఎక్కడైనా వెళుతున్నా, వాటిని పసిగట్టిన టర్కీ కోళ్ళు వేటాడి చంపుతాయి. ఈ విధంగా అవి చేస్తుండటంతో పలు చోట్ల టర్కీకోళ్ళ విక్రయ కేంద్రాలు ఏర్పడ్డాయి. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి టర్కీకోళ్ళను దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నారు.

# పూతల'పట్టు'పై ఇరు పార్టీల ఆశలు

**- హ్యాట్రిక్ విజయం సాధిస్తామని వైకాపా ధీమా!**
**- సత్తా చాటుతామని 'దేశం' ధైర్యం - కాంగ్రెస్ భారీగా ఓట్లు చీల్చితే వైకాపాకు తీరని నష్టం - 2009, 2014 ఎన్నికల్లో ఇక్కడి నుండి స్వల్ప ఓట్లతో ఓటమి పాలైన తెలుగుదేశం**

చిత్తూరు, మే 28 ప్రభాతవార్త: ఓట్ల లెక్కింపు సమయం సమీపిస్తుం డటంతో పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎవరనే విషయంపై సర్వత్రా చర్చ జోరుగా సాగుతుంది. ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం తమదంటే తమదేనని ఇటు అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్, అటు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీల నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పూతలపట్టు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకు మూడు సార్లు ఎన్నికలు జరుగితే ఇప్పటి వరకు ఇక్కడి నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు విజయం వరించలేదు. 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఇక్కడి నుండి స్వల్ప ఓట్ల తేడాతో ఒకసారి కాంగ్రెస్, మరోసారి వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థుల చేతిలో ఓటమి పాలయ్యారు. 2019 ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా హవా వీచడంతో ఇక్కడి నుండి వైకాపాకు 29 వేల ఓట్ల మెజార్టీ అభించింది. రెండు సార్లు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన తెలుగుదేశం పార్టీ ఈ ఎన్నికల్లో ఎలాగైనా ఇక్కడి నుండి తెలుగుదేశం అభ్యర్థి విజయం సాధించాలని కసితో పని చేసింది. ఇక్కడి నుండి ప్రస్తుత వైకాపా సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలవడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ చీల్చే ఓట్లు తెలుగుదేశం పార్టీకి లాభిస్తాయని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇక్కడి నుండి మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ విజయం నమోదు చేయాలని వైకాపా ఎన్నికల్లో సర్వశక్తులు ఒడ్డింది. ప్రస్తుతం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో పూతలపట్టు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 87.66 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,20,999 ఓట్లు వుండగా ఇందులో 1,93,730 ఓట్లు పోల్ అయ్యాయి. నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,08,811 పురుషుల ఓట్లు వుండగా ఇందులో 95,962 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే నియోజకవర్గ పరిధిలో 1,12,181 మహిళా ఓటర్లు వుండగా ఇందులో 97,767 మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గం పూర్తిగా పల్లె వాతావరణంలో వుండటం, పోలింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడంతో ఇరు పార్టీల అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు అధికంగా వుండటం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హులు అధిక సంఖ్యలో వుండటంతో ఈ సారి ఎన్నికల్లో విజయం తమదే అనే ధీమా అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో వ్యక్తం అవుతుంది. ప్రభుత్వంపై వున్న వ్యతిరేకతతో పాటు తమ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలకు ఓటర్లు ఆకర్షితులయ్యారని, అందుకే పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 7 గంటలైనా ఓటర్లు బారులు తీరి పోలింగ్‌లో పాల్గొన్నారని ఈ సారి పూతలపట్టు నియోజకవర్గంలో విజయం సాధించి బోణి కొడ్తామని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా ఓట్ల లెక్కింపు సమయం సమీపిస్తుండటంతో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ఓట్ల లెక్కింపు ఎప్పుడెప్పుడా! అనే ఉత్కంఠతతో నిరీక్షిస్తున్నారు.